

నేడు నర్సాపురంలో జిల్లాస్థాయి స్పందన

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం ఈ నెల 24వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుండి నరసాపురం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోను 'స్పందన' కార్యక్రమం సోమవారం యధావిధిగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. జిల్లా అధికారులు ఉదయం 9.30 గంటలకు నరసాపురం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో విధిగా హాజరుకావాలని తెలిపారు. ఫిర్యాదుదారులు స్పందన కార్యక్రమాన్ని గమనించి నరసాపురం మున్సిపల్ కార్యాలయానికి రావాలని కోరారు.


పాలకొల్లు రూరల్‌లో..


ఆకివీడులో..


కాళ్లలో..

అకాల వర్షం.. ఆగమాగం..!

డెల్టాలో పలుచోట్ల జల్లులు.. పరుగులు పెట్టిన రైతులు
ఈదురుగాలులకు నేలనంటిన వరిపైరు
మరో రెండు రోజులు వర్షం హెచ్చరికలతో సర్వత్రా ఆందోళన

దాళ్వా వరి మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవలే కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కావడంతో రైతులు వరి మాసూళ్లు హడావుడిగా సాగిస్తున్నారు. అదే సమయంలో ధాన్యం పట్టుబడికి అధికారులు అవసరమైనన్ని సంచులు ఇవ్వకపోవడం, ఇచ్చిన సంచులు చిరుగులతో నిండి ఉండటం, ఆపై రవాణాకు లారీలు లేకపోవడం వంటి సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ దశలో గోరుచుట్టుపై రోకటిపోటులా వాతావరణంలో మార్పులుచోటుచేసుకుని పలుచోట్ల చినుకులు పడటం, ఆకాశం మేఘావృతమై ఉండటం, ఈదురుగాలులు వీయడంతో వరి రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి రైతాంగం లబోదిబోమన్నారు. కోతల సమయంలో అకాల వర్షం కొంప ముంచిందని వరి రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలో 11,580 ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం వరిపంట మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షాల వల్ల ధాన్యం రంగుమారే ప్రమాదం ఉందని, నూకశాతం కూడా పెరుగుతుందని, ఫలితంగా ధర తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.40 వేలు వరకూ పెట్టుబడి పెట్టామని, ఇప్పుడు వర్షాల వల్ల ధాన్యం గట్టు చేర్చేందుకు అదనంగా రూ.ఐదు వేలకుపై వెచ్చించాల్సి వస్తుందని వాపోయారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు. తడిచి ముద్దయిన వరి పంటను వ్యవసాయాధికారి ప్రసాద్ పరిశీలించారు. పంట నష్టం వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులను ఆదుకుంటామని తెలిపారు.


పెనుమంట్ర: ఆదివారం తెల్లవారుజాము నుండి వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని వర్షం కురిసింది. మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురిసింది. ముఖ్యంగా పొలమూరు, పెనుమంట్ర, మామిడూరు, జుత్తిగ, నత్తారామేశ్వరం తదితర గ్రామాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. దీంతో వరి రైతులు ఒబ్బిడి చేసిన ధాన్యం, చేతికొచ్చిన వరి పంటను రక్షించుకునేందుకు పరుగులు తీశారు.

మొగల్తూరు: మండలంలోని గ్రామాల్లో ఆదివారం ఉదయం నుండి అకాల వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. దాళ్వా వరి మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో కురిసిన వర్షం వరి రైతులను నిలువునా ముంచింది. పలుచోట్ల వరిపైరు కోసి పనలపై ఉండగా కొన్నిచోట్ల ధాన్యం బస్తాలు కల్లాల్లోనే ఉన్నాయి. ఇవన్నీ తడిచి ముద్దయ్యాయి.

గోనె సంచులు, టార్పాలిన్లు ఇవ్వండి

రైతు మాదాసి గోపీ

ఉండి: ధాన్యం నూర్పిళ్లు జరిగి పట్టుబడి పట్టే సమయంలో అకాల వర్షాల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పాందువ్వ గ్రామానికి చెందిన రైతు మాదాసి గోపీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ నూర్పిళ్లు జరిగి ధాన్యం పట్టుబడి పట్టే సమయంలో వర్షాలు కురవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. పట్టుబడి పట్టిన ధాన్యాన్ని తడవకుండా రక్షించుకోవడం కత్తిమీద సాములా మారిందని వివరించారు. ధాన్యాన్ని భద్రపర్చుకోవడానికి రైతులకు టార్ఫాలిన్లు పంపిణీ చేయడంలో వ్యవసాయ శాఖాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ధాన్యం పట్టుబడికి అవసరమైన గోనె సంచులను సమకూర్చడంలో పౌరసరఫరాల శాఖాధికారులు అదే నిర్లక్ష్యం కనబరుస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి గోనె సంచులు సరిపడా ఇవ్వడంతోపాటు అకాల వర్షాల నుంచి రక్షించుకునేందుకు టార్ఫాలిన్లు పంపిణీ చేయాలని ఆయన కోరారు.


గణపవరంలో తడిచిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

ఆక్వా చెరువుల్లో ఆక్సిజన్ శాతం పడిపోవడంతో సాగుదారులు ఏరియేటర్లతో పంటను రక్షించుకునే ప్రయత్నం చేశారు.

కాళ్ల: ఆదివారం ఉదయం వీచిన ఈదురుగాలులు, కురిసిన వర్షానికి మండలంలో పలు గ్రామాల్లో వరి పంట నేలకొరిగి తడిచిముద్దయ్యింది. దీంతో రైతులు నష్టపోయారు. మండలంలో నాలుగు వేల ఎకరాల్లో దాళ్వా సాగు చేపట్టారు. మండలంలో కొన్నిచోట్ల కొద్దిపాటి వర్షం, మరికొన్ని చోట్ల భారీ వర్షం కురిసింది. రైతులు ధాన్యంపై బరకాలు కప్పి తడవకుండా రక్షించుకునే ప్రయత్నం చేశారు. తడిసిన పంటను ఆరబెట్టడం తదితర పనులకు పెట్టుబడి పెరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పైగా ధర తెగ్గోసే ప్రమాదం ఉందని వాపోతున్నారు. కాళ్ల, సీసలి, దొడ్డనపూడి, జక్కరం గ్రామాల్లో ధాన్యం రాశులను బరకాలతో కప్పడానికి రైతులు, కౌలురైతులు నానావస్థలు పడ్డారు. జువ్వలపాలెం, ఏలూరుపాడు, కాళ్లకూరు, దొడ్డనపూడి తదితర గ్రామాల్లో కోత దశకు చేరుకున్న వరి చేలు ఈదురుగాలులకు నేలకొరిగాయి. కోపల్లె, వేంపాడు, పెదఅమిరం గ్రామాల్లో వరి పనలను గట్టుకు చేర్చి పంటను రక్షించుకునే ప్రయత్నం చేశారు. మరో రెండు, మూడు రోజులు ఇలాగే గాలులు, వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతులు, కౌలు రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ఆచంట: మండలంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి ఆకాశం మేఘావృతమై ఉరుములు మెరుపులతో ఒక మోస్తరు వర్షం కురిసింది. ఈ తరహాలో గత వారం రోజుల నుంచి మండలంలో ఆచంట, కొడమంచిలి, కోడేరు, కందరవల్లి, కరుగోరుమిల్లి, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు తదితర గ్రామాల్లో దాళ్వా పంట మాసూళ్ల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు ఎక్కడపడితే అక్కడ ధాన్యం రాశులుగా పోశారు. కౌలు రైతులకు కల్లాలు లేకపోవడంతో రహదారుల పక్కన, మార్కెట్ యార్డు ఆవరణలోనూ, లేఅవుట్ల వద్ద తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటూ రక్షించుకునే పనుల్లో కౌలురైతులు నిమగ్నమయ్యారు. అకాల వర్షాల నేపథ్యంలో కౌలురైతులకు కంటిమీద కునుకు లేకుండాపోతుంది.

వీరవాసరం: వాతావరణ మార్పులతో రైతులు అందోళన చెందుతున్నారు. నాలుగు రోజుల వరకు వర్షాలు కురుస్తాయని వాతవారణ శాఖ హెచ్చరించడంతో రైతులు చేతికొచ్చిన పంటను ఎలా కాపాడుకోవాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. మండలంలో సుమారు 16 వేల ఎకరాల్లో దాళ్వా వరి సాగు చేశారు. రైతులు ఎంటియు-1121, 1153, 1156, 3626 రకాలు సాగు చేశారు. వారం రోజుల నుండి బొబ్బనపల్లి, చింతలకోటిగరువు, కొణితివాడ, మడుగుపోలవరం, మత్స్యపురి, నందమూరుగరువు, రాయకుదురు, తోకలపూడి, తోలేరు, ఉత్తరపాలెం, వీరవాసరం తదితర ప్రాంతాల్లో వరి కోతలు ప్రారంభమైనట్లు వ్యవసాయాధికారి గీతాదేవి తెలిపారు. ప్రస్తుత ఈ ప్రాంతాల్లో ధాన్యం తేమ శాతం 17కుపైగా ఉంటుందని, దీనికి తోడు వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం ఆరబెట్టుకునేందుకు ఇబ్బంది ఉందని రైతులు వాపోతున్నారు. శనివారం రాత్రి నుండి కురుస్తున్న వర్షాలతో రైతులు చేలల్లోని ధాన్యాన్ని గట్టుకు చేర్చుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో సాగు ఖర్చులు మరింత పెరిగే అవకాశం ఉందని కౌలు రైతులు కేతా రాంబాబు, వీరవల్లి మురళీకృష్ణ తెలిపారు. తేమ శాతంతో సంబంధం లేకుండా ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు. ధాన్యం కొనుగోలు పక్రియను సరళతరం చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


పాలకొల్లు: పట్టణంలో వాతావరణం ఆదివారం పూర్తిగా చల్లబడింది. ఉదయం కొద్దిపాటి వర్షం కురిసింది. ఉక్కబోత తగ్గి వాతావరణం చల్లగా ఆహ్లాదకరంగా మారడంతో జనం సేదతీరారు. రైతులు మాత్రం పంటను రక్షించుకునేందుకు పరుగులు తీశారు.

పాలకొల్లు రూరల్: మండలంలో పలు గ్రామాల్లో ఉదయం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

ఆకివీడు: రెండు రోజులుగా వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో రైతుల గుండెల్లో గుబులు నెలకొంది. చేతికొచ్చిన పంట నీళ్ల పాలయ్యే ప్రమాదం ఏర్పడిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. విత్తన చేల కోతలు ఇప్పటికే పూర్తయ్యాయి. ప్రస్తుతం ధాన్యం ఆరబెడుతున్నారు. మరికొన్నిచోట్ల వరి పనలుపై ఉంది. మిగిలిన పంట అంతా మరో 15 రోజుల్లో కోతకు రానుంది. ఈ పరిస్థితుల్లో వాతావరణ మార్పులు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. చిన్నపాటి జల్లులు పడినా పెద్దగా వర్షం కురవకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

వరి కోతలు ఆపండి: ఎఒ

అత్తిలి: రాబోయే రెండు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని, దీనిదృష్ట్యా రైతులు వరి కోతలు ఆపడం మంచిదని వ్యవసాయాధికారి రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఆకస్మికంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని పలు గ్రామాల్లో ఒక మోస్తరు వర్షం కురిసిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వరి కోతలు రెండు రోజులు ఆపితే ఉపయోగకరమని సూచించారు.


కాళ్ల మండలంలో నేలనంటిన వరిపైరు


వీరవాసరంలో..


మొగల్తూరులో..

భూపంపిణీ ఘనత వైఎస్ కుటుంబానిదే

రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - నరసాపురం రూరల్

నిరుపేదలకు భూపంపిణీ ఘనత వైఎస్ కుటుంబాలకే దక్కుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆదివారం మండలంలోని దర్బరేవు గ్రామంలో హైస్కూల్ వద్ద 1754 ఎకరాల కంపెనీ భూమికి సంబంధించి 1602 మంది రైతులకు ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, జిల్లా జాయింటు కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌తో కలిసి మంత్రి ధర్మాన దస్తావేజులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి ధర్మాన మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో రైతులకు వారు అనుభవిస్తున్న భూములపై సర్వ హక్కులు కల్పిస్తుందన్నారు. వ్యవసాయానికి అనుకూలంగా లేని భూములను ఇతర రంగాల కోసం ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు కూడా చట్టాలను సరిచేసి నూతన విధానాలకు శ్రీకారం చుట్టేందుకు ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. 25 సంవత్సరాల క్రితం ఇచ్చిన పట్టాలకు క్రయవిక్రయాలు జరుపుకునేందుకు కూడా చట్టాన్ని సవరించే ఆలోచన ప్రభుత్వం చేస్తుందని, అందుకు పరిశీలనా కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. నిరుపేదలకు భూపంపిణీలో ఆనాడు రాజశేఖర్‌రెడ్డి, నేడు జగన్మోహన్‌రెడ్డి ముందున్నారన్నారు. ఒక చిన్న గ్రామంలో 1754 ఎకరాల భూమి 1602 మంది రైతులకు అందించడం సామాన్య విషయం కాదన్నారు. ఈ ఘనత చీఫ్‌విప్ ప్రసాదరాజుకు దక్కుతుందన్నారు. ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు మాట్లాడుతూ మన ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, రైతుల కోసం చితశుద్ధితో పని చేస్తుందని అన్నారు. నరసాపురం నియోజకవర్గంలో సుమారు 20 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని రైతులు లీజుకు తీసుకుని సాగు చేస్తూ క్రాప్ ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతుభరోసా తదితర ఫలాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి కోసం చట్టాలను సవరించి అనధికార భూమిని జిరాయితీ భూమిగా మార్చి రైతులకు కేవలం రూ.వందకే ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేసి రైతులకు ఉచితంగా అందిస్తుందన్నారు. దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పేదరికమే కొలమానంగా ప్రతి లబ్ధిదారునికీ ప్రభుత్వ ఫలాలు పారదర్శకంగా అందిస్తున్నామన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల చేతిలో భూములున్నా అనుభవ హక్కులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిరాయితీ భూమిగా సర్వహక్కులు కల్పించి రైతులకు ఉచితంగా పట్టాలు అందిస్తున్నామని తెలిపారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ నవరత్నాలు ద్వారా అనేక సంక్షేమ పథకాలు అర్హులకు అందించిన ఘనత సిఎం జగన్ సొంతమన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఎంపిపి మైలాబత్తుల సోనీ, ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, తహాశీల్దారు ఎస్ఎం.ఫాజిల్, జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాపూజీ, మాజీ అప్కాబ్ ఛైర్మన్ అంద్రాజు చల్లా రావు, పీడీ.రాజు, గ్రామ సర్పంచి పెనుమత్స విజయలక్ష్మి, దొంగ మురళీకృష్ణ, చాగంటి సత్యనారాయణ, ఆత్మ కమిటీ ఛైర్మన్ కడలి రాంబాబు, రైతులు పాల్గొన్నారు.


మంత్రి ధర్మానకు చిత్రంతో కూడిన మెమెంటో అందిస్తున్న గ్రామస్తులు, ప్రముఖులు


పెనుమంట్ర: మాట్లాడుతున్న సుబ్బరాజు

కొనసాగిన ప్రచార భేరి యాత్రలు

ప్రజాశక్తి - పోడూరు

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టే ఆందోళనల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. సిపిఎం ఆధ్వర్యాన ప్రచార భేరి యాత్ర ఆదివారం ఏడో రోజు పండితవిల్లూరు, జగన్నాధపురం, కవిటం మీదుగా పోడూరు చేరుకుంది. కార్యక్రమంలో బొంతు శ్రీను, ముడే మోజేష్, కాకర వెంకటేశ్వర్లు, బూరాబత్తుల వెంకట్రావు, కాటూరి యాకోబు, బొంతు శంకరం, కంకటాల భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్ర: సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచార భేరి ఆదివారం పొలమూరు గ్రామంలో సాగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె.సుబ్బరాజు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా ధరలు ఆకాశన్నంటుతున్నా తగ్గింపునకు ఎటువంటి చర్యలూ చేపట్టడం లేదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు కేతా పద్మజ, బత్తుల విజయకుమార్, చింతపల్లి తిరుమలరావు, కట్టా సత్యనారాయణ, కేతా ప్రమోద్, పంపన సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


శిబిరాన్ని ప్రారంభిస్తున్న పివిఎల్

ఉచిత వైద్యశిబిరాలు ఉపయోగకరం

ప్రజాశక్తి - కాళ్ల

పల్లెల్లో పేదలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహారాజు అన్నారు. బొండాడలో అశోక్ కిడ్నీ సెంటర్ (భీమవరం) సహకారంతో గ్రామ సర్పంచి మన్నే వరలక్ష్మి, నాగరాజు నంబూరిరామకృష్ణంరాజు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పివిఎల్ ప్రారంభించి మాట్లాడుతూ మనం తాగే నీరు, తినే ఆహారం కలుషితం కావడంతో అనారోగ్యం పాలవుతున్నారన్నారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసిన డాక్టర్ భూపతిరాజు అశోక్ వర్మ, నంబూరి రామకృష్ణంరాజు, మన్నే నాగరాజులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ శిబిరంలో వైద్య నిపుణులు డాక్టర్ భూపతిరాజు అశోక్‌వర్మ జనరల్, మూత్రపిండాల, మూత్ర వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఇతర పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బొండాడ, బొండాడపేట పరిసర గ్రామాలకు చెందిన సుమారు 409 మంది రోగులు ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ భూపతిరాజు అశోక్‌వర్మ మాట్లాడుతూ పేదలకు తక్కువ ఖర్చుతో అశోక్ కిడ్నీ సెంటర్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. క్యాంప్ ద్వారా వైద్యం కోసం వచ్చిన రోగులకు 50 శాతం రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపిపి పెనుమత్స శిరీష విశ్వనాథరాజు, మన్నే శ్రీనివాస్, కందుల హనుమ, పెనుమత్స రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

25న పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరాన్ని ఈ నెల 25వ తేదీ మంగళవారం సాయంత్రం మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహిస్తున్నట్లు వి. రాధాకృష్ణ, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) పిల్లలను పరిశీలించి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

15 సంవత్సరాల్లోపు వయస్సు గల చిన్నారులకు మెడికల్ క్యాంపులో ఉచిత పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. ఈ శిబిరంను భీమవరం, భీమవరం చుట్టుపక్కల ప్రాంతాల వారు వినియోగించుకోవాలని కోరారు.


బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించిన మాజీ మంత్రి పితాని సత్యనారాయణ

ఆటల్లో గెలుపోటములు సహజం

మాజీ మంత్రి పితాని

ప్రజాశక్తి - తణుకు

ఆటల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో తలపెట్టిన ఎన్‌టిఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఈ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. సినీ, రాజకీయ రంగాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న మహనీయుడు ఎన్‌టిఆర్ అని కొనియాడారు. మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ టోర్నమెంట్‌ను ఆర్గనైజ్ చేస్తున్న ప్రేమకృష్ణ, జయకుమార్ టీమును అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ పరిమి వెంకన్నబాబు, నాయకులు మంత్రి రావుబాబు, కలగర వెంకటకృష్ణ, ఉమ్మి రాంబాబు, నల్ల భాస్కరరావు, గుబ్బల శ్రీనివాస్, చుక్క సాయిబాబా, పితాని మోహన్‌రావు, తాతపూడి మారుతీరావు పాల్గొన్నారు.

పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకుల సందడితో కళకళలాడింది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక వాహనాలపై బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర స్నానాలు చేసి ఉల్లాసంగా గడిపారు. అనంతరం సమీపంలోని ఆలయాలను సందర్శించి సరివే, కొబ్బరి తోటల్లో భోజనాలు చేసి సేదతీరారు.



పేరుపాలెం బీచ్‌లో పర్యాటకులు



హక్కుల కోసం పోరాడాలి : సిఐటియు

ప్రజాశక్తి - పెనుమంట్ర

కార్మికులు, కర్షకులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, శ్రామికులు హక్కులను, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు పోరాడాలని సిఐటియు మండల కార్యదర్శి కోడె శ్రీనివాస్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. సిఐటియు మండలం విస్తృత సమావేశం స్థానిక అన్నపూర్ణ గ్రంథాలయంలో ఆదివారం వెలగల నాగిరెడ్డి అధ్యక్షన నిర్వహించారు. ఈ సందర్భంగా కోడె శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మికులపై పని భారం పెరుగుతుందన్నారు. కార్మిక, రైతాంగ చట్టాలను హరించేందుకు కేంద్ర ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దానికి రాష్ట్ర ప్రభుత్వం తల ఊపుతూ అన్ని అమలు చేసుకుంటూ వెళ్తుందన్నారు. అంగన్‌డీలపై, మధ్యాహ్న భోజనం కార్మికులపై, ఆశా కార్మికులపై ప్రభుత్వ ఉద్యోగులపై అనేక విధాలుగా పని భారం మోపుతున్నారన్నారు. స్వేచ్ఛను హరిస్తుందని, హక్కులను కాల రాస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదాయం తగ్గిపోతుందని, ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో అనేక పోరాటాల ద్వారా కార్మికులు, కర్షకులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, శ్రామికులు యువత అందరూ హక్కులను, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాదాసు లక్ష్మణరావు, గంటి ఆంజనేయులు, పిల్లి జగదీష్, ధరణి, శ్రీను, రామకృష్ణ, రాజా పాల్గొన్నారు.



మేరీని పరామర్శిస్తున్న జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్

మేరీకి జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ పరామర్శ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణం పదో వార్డుకు చెందిన రొక్కల మేరీపై జరిగిన దాడిని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ ఖండించారు. పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మేరీని ఆయన ఆదివారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి హాస్పిటల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మేరీకి మెరుగైన వైద్యం అందించాలని పలు సూచనలు చేశారు. జిల్లా ఎస్‌పి, పట్టణ సిఐ, ఎస్‌ఐలతో మాట్లాడి దాడి చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు వైసిపి నాయకులు గుణ్ణం నాగబాబు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, నంబూరి గంగాపవన్, ఖండవల్లి వాసు, పెద్ద మధు, చిన్న మధు, పసుపులేటి వీరాస్వామి ఉన్నారు.

నిమ్మకాయ ధరకు రెక్కలు

ప్రజాశక్తి - పాలకొల్లు



పాలకొల్లు మార్కెట్‌లో నిమ్మకాయలు

నిమ్మకాయ ధరలకు రెక్కలొచ్చాయి. నాణ్యమైన నిమ్మకాయ రూపాయికి వచ్చేది. అయితే ఇప్పుడు రూ.5 నుంచి రూ.8 వరకు పెరిగింది. దీంతో వేసవిలో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుతం రేటు అధికంగా ఉండటంతో పిందె దశలోనే నిమ్మకాయలు కోసి వేయడంతో నాణ్యత లేని నిమ్మకాయలు మార్కెట్‌కు వస్తున్నాయి. వేసవిలో నిమ్మకాయ వాడకం ఎక్కువగా ఉంటుంది. వేసవి తాపానికి నిమ్మసోడా ఎక్కువగా వాడుతారు. గత నవంబర్, డిసెంబర్ నెలల్లో భారీ వర్షాల కారణంగా అన్ని రాష్ట్రాల్లో దిగుబడులు తగ్గి రేటు పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు.

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికలతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. యాత్రికులకు ఎటువంటి సౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు, పాలకవర్గ సభ్యులు, ఆల య సిబ్బంది ఏర్పాటు చేశారు. ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు చేశారు.

నేరాలు - ఘోరాలు

ఉపాధి కోసం కువైట్ వెళ్లిన వ్యక్తి మృతి

కొమ్ముచిక్కాలలో విషాదఛాయలు

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని కొమ్ము చిక్కాల గ్రామం శివారు ఎఎస్‌ఆర్ కాలనీకి చెందిన తండా చార్లెస్(40) ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి అక్కడ మృతి చెందాడు. చార్లెస్ మృతితో ఎఎస్ఆర్ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుని కుటుంబసభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... కొమ్ముచిక్కాల శివారు ఎఎస్ఆర్ కాలనీకి చెందిన తండా చార్లెస్(40) ఐదేళ్ల క్రితం ఉపాధి కోసం కువైట్ దేశానికి వెళ్లాడు. అక్కడ ఒక షేట్ దగ్గర డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో చార్లెస్ అక్కడ గుండెపోటుతో ఈ నెల 18వ తేదీన మృతి చెందాడు. ఈ విషయాన్ని అక్కడ షేట్ కొమ్ము చిక్కాలలోని కుటుంబ సభ్యులకు తెలిపారు. చార్లెస్ తల్లి వజ్రమ్మ, సోదరి అన్నామని కూడా అదే దేశంలో ఉన్నారు. వారి ద్వారా సమాచారం తెలుసుకున్న అక్కడి తెలుగువారు చార్లెస్ మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేందుకు ఏర్పాట్లు చేశారు. వారి చొరవతో చార్లెస్ మృతదేహం ఆదివారం స్వగ్రామమైన కొమ్ముచిక్కాల చేరుకుంది. తల్లి, సోదరి కూడా స్వగ్రామానికి వచ్చారు. మృతునికి భార్య బేబి, ఇద్దరు కుమారులు రవి, సుధీర్ ఉన్నారు. రవి తొమ్మిదో తరగతి, సుధీర్ ఏడో తరగతి చదువుతున్నారు. కుటుంబపోషణ కోసం దేశం కానీ దేశం వెళ్లిన చార్లెస్ అకాల మృతితో భార్య, కుమారులు, కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గణపవరం

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన వెంకట్రాజపురంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. గణపవరం ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకట్రాజపురం గ్రామానికి చెందిన గందం గోవిందరావుకు చెందిన చేపల చెరువుపై ఒడిశాకు చెందిన ముల్లాక్ సిప్పు (23) మూడు నెలల నుంచి కాపలాదారునిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం జనరేటర్ ఆఫ్ చేసేందుకు వెళ్లిన సిప్పు విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో అతడిని పిప్పర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సిప్పు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని అన్న ముల్లాక్ అబ్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

హై ఓల్టేజీతో ఫ్రిడ్జ్ దగ్ధం

ప్రజాశక్తి - ఉండి


హై ఓల్టేజీతో ఫ్రిడ్జ్ దగ్ధమైన సంఘటన ఉండి గ్రామం పెద్దపేటలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఉండి గ్రామం పెద్దపేటకు చెందిన మహిళ కందుకూరి బాల ఇంట్లో హై ఓల్టేజీతో ఫ్రిడ్జ్‌లోంచి మంటలు వచ్చాయి. దీంతో ఆమె కేకలు వేస్తూ బయటికి వెళ్లిపోగా స్థానికులు స్పందించి ఇంట్లోని కరెంటు మెయిన్ ఆఫ్ చేశారు. దీంతో పెను ప్రమాదం నుంచి తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గ్రామంలో ఇటీవల ఓల్టేజీ సమస్యలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయని, వీటిని అధిగమించాలని స్థానికులు విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు.

నిరుపయోగంగా సంచార చికిత్స వాహనాలు

ప్రజాధనం వృధా అని విమర్శలు

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రభుత్వం మారినప్పుడల్లా పథకాలు మారిపోవడం సర్వసాధారణం అయిపోయింది. టిడిపి హయాంలో ఇంటింటికి వైద్యం అందించిన సంచార వైద్యానికి వినియోగించిన వాహనాలు పొదల మాటుకు చేరాయి. ఆ పనిముట్లు చెత్తగుట్టల పాలయ్యాయి. రూ.లక్షలు వెచ్చించి ఖరీదు చేసిన ఆ వాహనాలు నేడు నిరుపయోగంగా మూలన పడి ఉన్నాయి. ప్రభుత్వం మారినప్పుడల్లా పనిముట్లు, వస్తువులు నిరుపయోగంగా మారుతున్నాయి. రూ.లక్షల ప్రజాధనం వృధా అవుతుంది. ఒక ప్రభుతం హయాంలో పథకాల అమలు కోసం రూ.లక్షలు వెచ్చించి పనిముట్లు ఏర్పాటు చేస్తాయి. పనిముట్లు, వస్తువులు, వాహనాలు సిద్ధమయ్యేనాటికి ప్రభుత్వం మారిపోతుంది. ఇక కొత్త ప్రభుత్వం వచ్చిన అనంతరం ఆ పథకాలు అమల్లోకి తీసుకోకపోయినా వస్తువులు, వాహనాలు వినియోగించుకుంటే పర్వాలేదు. లేకపోతే రూ.లక్షలు వెచ్చించి సిద్ధం చేసిన ఆ వస్తువులు చెత్తగుట్టల పాలవుతున్నాయి. లేదా పక్కదారి పడుతున్నాయి. దీంతో రూ.కోట్లలో ప్రజాధనం వృధా అవుతుంది. ఈ ధనం మొత్తం తిరిగి పన్నుల రూపంలో ప్రజల నుంచి వసూలు చేస్తారు. ఈ విధంగా రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని వందల వాహనాలు మూలనపడ్డాయో, ఎన్ని కోట్ల రూపాయలు ప్రజాధనం వృధా అయిందోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.




ఆకివీడు సిహెచ్‌సిలో నిరుపయోగంగా ఉన్న వాహనం

గొప్ప సంఘ సంస్కర్త బసవేశ్వరుడు

ఘనంగా జయంతి వేడుకలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

లింగ వివక్షత లేకుండా అందరూ సమానమేనని, అందుకు కులరహిత సమాజం ఉండాలని చెప్పిన బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త అని శైవశ్రీ తాళ్ల సాంబశివరావు (గురు స్వామి) అన్నారు. బసవేశ్వరస్వామి జయంతి సందర్భంగా 39వ వార్షికోత్సవాన్ని కీర్తిశేషులు సప్పరపు గణపతి కుమారులు సప్పరపు కనక లింగేశ్వరరావు, సప్పరపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కళ్యాణ మండపంలో శైవశ్రీ తాళ్ల సాంబశివరావు (గురు స్వామి) సమక్షంలో 25 మంది శివ భక్తులు లింగ దీక్ష స్వీకరించారు. ఈ సందర్భంగా గురు స్వామి మాట్లాడుతూ కర్ణాటకలో బీజాపూర్ జిల్లా బాగేవాడలో శైవ బ్రాహ్మణ కుటుంబంలో మండేన మాదిరాజు మాతాంబిక దంపతులకు జన్మించిన బసవేశ్వరుడు వైదిక కర్మకాండలను వ్యతిరేకించడంతో పాటు కుల మతాలకు కట్టుబాటు విధించడం సరికాదన్నారు. మనిషిని మనిషిగా చూడాలని, అహింస మార్గం ఉత్తమం అని, మహిళా హక్కులను ఆచరణలో పెట్టి చూపించారన్నారు. దయ, కరుణ, జాలి ఇవన్నీ మనుషులకు నిజమైన ఆభరణాలని సాటి చెప్పిన మహానుభావుడు బసవేశ్వరుడు అని ఆయన కొనియాడారు. అంటరానివాళ్లకు లింగధారణ చేసి కుల మతాలలో ఎక్కువ తక్కువ లేదని సామాజిక న్యాయం కోసం కృషి చేసిన మహనీయుడు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సప్పరపు శివకోటయ్య, సోరపల్లి బసవకోటయ్య, వాసా నరసన్న, కరెర్ల గుణ సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గురు స్వామి

నేడు పంచాయతీలకు అవార్డుల ప్రదానోత్సవం


ప్రజాశక్తి - పెనుమంట్ర

గ్రామ పంచాయతీలకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి) ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయిలో మూడో థీమ్ బాలల స్నేహ పూర్వక గ్రామంగా రెండో స్థానంలో మండలంలోని నెలమూరు గ్రామం ఎంపికైందని తెలిపారు. జిల్లా స్థాయిలో ఒకటో థీమ్ పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు కలిగిన గ్రామంగా రెండో స్థానంలో మల్లిపూడి, మూడో స్థానంలో నెలమూరు ఎంపికైనట్లు పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో రెండో థీమ్ ఆరోగ్యవంతమైన గ్రామంగా రెండో స్థానంలో నెలమూరు, మూడో స్థానంలో నత్తారామేశ్వరం గ్రామం ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో మూడో థీమ్ బాలల స్నేహ పూర్వక గ్రామంగా రెండో స్థానంలో నెలమూరు గ్రామం ఎంపికైనట్లు పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో నాలుగో థీమ్ నీటి సంవృద్ధి కలిగిన గ్రామంగా రెండో స్థానంలో నెలమూరు, జిల్లాస్థాయిలో ఐదో థీమ్ పరిశుభ్రం, పచ్చదనం కలిగిన గ్రామంగా రెండో స్థానంలో ఓడూరు, మండల స్థాయిలో ఒకటో థీమ్ పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు కలిగిన గ్రామంగా ఒకటో స్థానంలో పెనుమంట్ర, రెండో స్థానంలో ఓడూరు, మూడో స్థానంలో మాముడూరు గ్రామాలు ఎంపికైనట్లు తెలిపారు. మండల స్థాయిలో రెండో థీమ్ ఆరోగ్యవంతమైన గ్రామంగా ఒకటో స్థానంలో మండలంలోని నెలమూరు గ్రామం, రెండో స్థానంలో నత్తా రామేశ్వరం, మూడో స్థానంలో మల్లిపూడి, మండల స్థాయిలో మూడో థీమ్ బాలల స్నేహ పూర్వక గ్రామ అవార్డుకు ఒకటో స్థానములో నెలమూరు, రెండో స్థానంలో మల్లిపూడి, మూడో స్థానంలో మాముడూరు గ్రామాలు ఎంపికైనట్లు తెలిపారు. మండల స్థాయిలో నాలుగో థీమ్ నీటి సంవృద్ధి కలిగిన గ్రామంగా ఒకటో స్థానంలో నెలమూరు, రెండో స్థానంలో మల్లిపూడి, మూడో స్థానంలో ఓడూరు గ్రామాలు ఎంపికైనట్లు తెలిపారు. మండలస్థాయిలో ఐదో థీమ్ పరిశుభ్రం, పచ్చదనం కలిగిన గ్రామంగా ఒకటో స్థానంలో ఓడూరు, రెండో స్థానంలో జుత్తిగ, మూడో స్థానంలో మల్లిపూడి గ్రామాలు ఎంపికైనట్లు తెలిపారు. మండల స్థాయిలో ఆరో థీమ్ స్వయం సంవృద్ధితో కూడిన మౌలిక సదుపాయాలు కలిగిన గ్రామంగా ఒకటో స్థానంలో పెనుమంట్ర, రెండో స్థానంలో నెలమూరు, మూడో స్థానంలో ఓడూరు ఎంపికైనట్లు తెలిపారు. మండల స్థాయిలో ఏడో థీమ్ సామాజిక న్యాయం, సామాజిక భద్రత కలిగిన గ్రామంగా ఒకటో స్థానంలో నెలమూరు, రెండో స్థానంలో ఓడూరు, మూడో స్థానంలో పెనుమంట్ర గ్రామాలు ఎంపికైనట్లు తెలిపారు. మండల స్థాయిలో ఎనిమిదో థీమ్ సుపరిపాలనతో కూడిన గ్రామంగా ఒకటో స్థానంలో పెనుమంట్ర గ్రామం, రెండో స్థానంలో ఓడూరు, మూడో స్థానంలో మాముడూరు గ్రామాలు ఎంపికైనట్లు తెలిపారు. మండల స్థాయిలో తొమ్మిదో థీమ్ మహిళా స్నేహ పూర్వక గ్రామంగా ఒకటో స్థానంలో పెనుమంట్ర, రెండో స్థానంలో నెలమూరు, మూడో స్థానంలో మల్లిపూడి గ్రామాలు ఎంపికైనట్లు తెలిపారు.


'మాంటిస్సోరి'లో స్కాలర్‌షిప్ వేడుకలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఉల్లంపర్రు మాంటిస్సోరి స్కూల్‌లో మెరిట్ స్కాలర్‌షిప్ వేడుకలను శనివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్‌సి కమిషన్ మెంబర్ చెల్లం ఆనందప్రకాష్, యడ్ల తాతాజీ, జెడ్‌పిటిసి సభ్యులు నడపన గోవిందరాజులునాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్కూల్ అడ్మినిస్ట్రేటర్ మద్దాల వాసు మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం కోసం ప్రతి సంవత్సరం రూ.పది లక్షల విలువైన మెరిట్ స్కాలర్‌షిప్‌లను 250 మంది విద్యార్థులకు అందిస్తున్నామని తెలిపారు. దీంతో విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగి మంచి చదువులు చదివి పైకి వస్తారని తెలిపారు. యడ్ల తాతాజీ మాట్లాడుతూ మాంటిస్సోరి స్కూల్‌లో చదువుకే కాకుండా క్రీడలకు కూడా సమానమైన ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. సైన్స్ ఫెయిర్‌లో లింకా బుక్ రికార్డుల్లో పేరు నమోదు చేసుకున్నారంటే సామాన్య విషయం కాదని తెలిపారు. జెడ్‌పిటిసి సభ్యులు గోవిందరాజులునాయుడు మాట్లాడుతూ గత సంవత్సరం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన తొమ్మిది మంది విద్యార్థులకు రూ.పది వేల చొప్పున ఇవ్వడం అంటే సామాన్యమైన విషయం కాదని తెలిపారు. ఆనందప్రకాష్ మాట్లాడుతూ మంచి విలువలతో కూడిన విద్య అందించటం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్, సెక్రటరీ మద్దాల రాంప్రసాద్, ప్రిన్సిపల్ ఎస్.వసంతలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందిస్తున్న వక్తలు



ఆత్మీయంగా కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - భీమవరం రూరల్

బంధుత్వం కన్నా గొప్పది స్నేహం ఒక్కటే... కుల మత బేధం చూడనిది...పేద ధనిక బేధం లేనిది... స్నేహం.. ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి.. ఇక్కడే కలిశాం.. చదువులమ్మ చెట్టు నీడలో.. అంటూ.. గడచిన ఆనాటి బాల్యాన్ని పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. లూథరన్ హైస్కూల్ 2002-2003 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు పూర్వ సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఒకరినొకరు పలకరించుకున్నారు. గత ఐదు నెలలుగా అందరినీ కలుపుకుని పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించామని తెలిపారు. 20 మంది ఉపాధ్యాయులను సత్కరించామని తెలిపారు.

నరసాపురం ఎక్స్‌ప్రెస్ షెడ్యూల్‌లో మార్పు

ప్రజాశక్తి - పాలకొల్లు

నరసాపురం-గుంటూరు మధ్య నడిచే 12781 నెంబర్ ఎక్స్‌ప్రెస్ సమయాల్లో సోమవారం నుంచి స్వల్పమార్పులు చేస్తున్నట్లు పాలకొల్లు స్టేషన్ మాస్టర్ రామలింగేశ్వరరావు తెలిపారు. గతంలో ఈ రైలు రాత్రి 11 గంటలకు నరసాపురం చేరేది. దీనివల్ల ప్రయాణికులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. షెడ్యూల్ మార్చాలని రైల్వే అధికారులుకు విన్నవించడంతో రాత్రి పది గంటలకు నరసాపురం చేరే విధంగా వేగం పెంచి షెడ్యూల్ మార్చారు. గతంలో మాదిరిగా ఈ రైలు గుంటూరులో సాయంత్రం 5.45కు బయలుదేరి విజయవాడ 6.50కు చేరుకుంటుంది. భీమవరం 9.15, పాలకొల్లు 9.45, నరసాపురం రాత్రి పది గంటలకు చేరుకుంటుంది. ఉదయం పూట నరసాపురం నుంచి యధావిధిగా 6.10కి గుంటూరు బయలుదేరుతుందని చెప్పారు.

సిద్ధాంతంలో రజకుల శ్రమదానం

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని సిద్ధాంతం రజక జనసేవ సంఘం వారు తమ కుల వృత్తి చేసుకునే చెరువుల చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు, ముళ్లకంపలను ఆదివారం శ్రమదానం చేసి శుభ్రం చేసుకున్నారు. సంఘ అధ్యక్షుడు దువ్వారపు వెంకట్రావు నాయకత్వంలో సుమారుగా 75 కుటుంబ సభ్యులు తమ సంఘ పరిధిలో ఉన్న రెండు చెరువుల చుట్టూ కులవృత్తులు చేసుకోవడానికి అణువుగా లేకుండా పెరిగిపోయిన ముళ్లకంపలు, మందుబాబులు తాగి పడేసిన బ్రాందీ బాటిల్స్ తీసివేయడానికి శ్రమదానం చేసుకుని, ఉతికిన బట్టలు ఆరేసుకోవడానికి, చెరువులో బట్టలు ఉతకటానికి బల్లలు ఏర్పాటు చేసుకున్నారు.



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న రజకులు

'చంద్రబాబు కాన్వాయ్‌పై దాడి హేయమైన చర్య'



ఆచంటలో నిరసన తెలుపుతున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - ఆచంట

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కాన్వాయ్‌పై రాళ్ల దాడి హేయమైన చర్య అని ఆచంట నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు బీరా నరసింహమూర్తి అన్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఆచంటలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తికి ఒక స్వేచ్ఛ ఉందన్నారు. ప్రతిఒక్కరికీ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ఉంటుందన్నారు. ప్రజల్లో తిరగడానికి పోలీసు అధికారులు అనుమతి ఇచ్చిన తరువాతే ఆయన బయలుదేరానన్నారు. శనివారం సాయంత్రం యర్రగుండపాలెంలో పోలీసు అధికారుల అనుమతితో చట్ట ప్రకారం సభ నిర్వహించడానికి వెళ్తే అక్కడ వైసిపి కార్యకర్తలు రాళ్ల దాడి చేయడం, పోలీసులు కనీసం చంద్రబాబు నాయుడుకు రక్షణ కల్పించకపోవడం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యదర్శి కనపాల వెంకటేశ్వరరావు, అచంట నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి తానేటి మదన్, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఆకుమర్తి మోహనరావు, పెనుగొండ మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు వెన్నపు వెంకటేశ్వరరావు, తెలుగు యువత నాయకులు సిర్రా బాలాజీ పాల్గొన్నారు.

నరసాపురం రూరల్ : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కాన్వాయ్‌పై ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పశ్చిమ గోదావరి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్ష నేత పట్ల వైసిపి అల్లరి మూకల తీరు అతి హేయమైన చర్య అని, ఇది అప్రజాస్వామికమని పేర్కొన్నారు. మంత్రి సురేష్ చంద్రబాబు పర్యటనలో అలజడికి కుట్ర పన్నారన్నారు. కొన్ని రోజులుగా చంద్రబాబు నిర్వహించిన రోడ్‌షోలు, బహిరంగ సభలకు ప్రజల నుంచి అనూహ్యమైన స్పందన లభించడంతో తట్టుకోలేక ఈ దారుణానికి పాల్పడ్డారన్నారు. రాష్ట్రంలో దళితులను, చివరికి దళిత ఉద్యోగులను కూడా వైసిపి ప్రభుత్వం బహిరంగంగా హత్యలు చేయిస్తుంటే నోరు మెదపలేని మంత్రి సురేష్ తాను దళిత పక్షపాతినని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నరు. డాక్టర్ అచ్చెన్నను ముఖ్యమంత్రి సొంత జిల్లాలో వేధించి చంపేస్తే ఆయన నోరు మెదపలేదన్నారు. దళితుడైన కారు డ్రైవర్ సుబ్రమణ్యాన్ని వైసిపి ఎంఎల్‌సి హత్య చేసి ఇంటికి డోర్ డెలివరీ చేస్తే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. డాక్టర్ సుధాకర్, కావలిలో కరుణాకర్, చీరాలలో కిరణ్ వీరి హత్యలకు సురేష్ ఏం సమాధానం చెప్తారన్నారు. ఇటీవల జగన్ సొంత నియోజకవర్గంలో మహిళను రేపు చేసి చంపారని ఇవేమీ మంత్రి సురేష్‌కి పట్టడం లేదన్నారు. చంద్రబాబు నాయుడు సభలకు వస్తున్న అశేష జనవాహినిని చూసి ఓర్వలేకపోతున్నారని పేర్కొన్నారు.


నేడు జాతీయ పంచాయతీ దినోత్సవం

ప్రజాశక్తి - పాలకోడేరు

జాతీయ పంచాయతీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలకోడేరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎస్.మురళీగంగాధరరావు ఆదివారం తెలిపారు. మండల స్థాయిలో ఈ సందర్భంగా వివిధ అంశా ల్లో అవార్డులు గెలుపొందిన పంచాయతీలకు ధ్రువీకరణ ప త్రాలు అందించనున్నట్లు తెలిపారు. పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామ పంచా యతీకి పారిశుధ్య నిర్వహణలో జిల్లా స్థాయి అవార్డు వచ్చినట్లు ఎంపిడిఒ మురళీగంగాధరరావు తెలిపారు.

జయప్రకాష్ మృతి తీరని లోటు

ప్రజాశక్తి - మొగల్తూరు



జయప్రకాష్ (ఫైల్)

మొగల్తూరుకు చెందిన రైతు, పారిశ్రామికవేత్త, ఆర్యవైశ్య సంఘం మొగల్తూరు గ్రామ కార్యదర్శి అనంతపల్లి జయప్రకాష్ (66) ఆదివా రం మృతి చెందారు. జయప్రకాష్ ఆర్యవైశ్య సంఘ అభివృద్ధికి, రైతులకు అండగా ఉండేవారు. ఆయన మృతి సంఘ అభివృద్ధికి తీరని లోటని పలువురు అన్నారు. ఆయన మృతదేహాన్ని పలువురు సంఘ సభ్యులు, ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

26న సీజ్డ్ వాహనాల వేలం

ప్రజాశక్తి - వీరవాసరం

వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 26వ తేదీన వీరవాసరం పోలీస్ స్టేషన్‌లో వేలంపాట నిర్వహించనున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీరవాసరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఈ వేలంపాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

పైపులైన్లకు మరమ్మతులు

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని ఉప్పులూరు గ్రామంలో సంత మార్కెట్ ప్రాంతంలో ఉన్న పైపులైను లీకేజ్ అవుతోంది. దీంతో తాగునీరు వృధా అవుతుందని గ్రామ సర్పంచి యర్రా దుర్గారావు పైపులైన్ మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో నీటి ఎద్దడిని తగ్గించేందుకు పైపులైన్ లీకేజీ జరిగి మంచినీరు వృధా జరిగే ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు. దీని ద్వారా మంచినీటి ఎద్దడిని నివారించవచ్చని తెలిపారు.

4 నుంచి వార్షిక మహోత్సవాలు

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని మహాదేవపట్నం గ్రామ దేవతలు మహంకాలమ్మ, వెంకమ్మ, గంగాదేవి, పోతురాజు వార్షిక మహోత్సవాలను మే నాలుగో తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ పెన్మెత్స రమేష్‌రాజు తెలిపారు. ఆదివారం జాతర మహోత్సవాలకు సంబంధించి రాటపాతి ఉత్సవ పనులను ప్రారంభించారు. అనంతరం రమేష్‌రాజు మాట్లాడుతూ మే నాలుగో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు అమ్మవారి ఆలయం రెండో వార్షిక మహోత్సవాలు జరుగుతాయని తెలిపారు. గ్రామంలోని ప్రజలే కాకుండా బయట గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మహోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వేడంగిలో 'జనంలోకి జనసేన'

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని వేడంగిలో జనసేన గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జనం చెంతకు జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో ఇంటింటికి వెళ్లి పవన్‌కల్యాణ్‌కు ఒకసారి అవకాశం ఇవ్వాలని రానున్న ఎన్నికల్లో జనసేన పార్టీని గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంచారు. తొలుత స్థానిక హిందూ శ్మశానవాటిక వద్ద దాతల సహకారంతో, జన సైనికుల శ్రమదానంతో రూ.రెండు లక్షల వ్యయంతో నిర్మించిన షెడ్డును గ్రామ సర్పంచి చెల్లబోయిన పద్మ పార్వతీ శారద ప్రారంభించారు. ఉప సర్పంచి వీరగొమ్ముల బుజ్జి, ఎంపిటిసి సభ్యులు యర్రంశెట్టి వెంకట నరసింహరావు, పెనుమదం ఎంపిటిసి సభ్యులు మానేపల్లి శ్రీధర్, జనసేన నాయకులు బండారు రాజేష్, తులా రామలింగేశ్వరరావు, యలమంచిలి మండల అధ్యక్షులు వరబాబు, పోడూరు మండల జనసేన అధ్యక్షులు పితాని వెంకటేష్, జనసేన జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.